పౌల్ట్రీ షెడ్లపై రైతుల అనాసక్తి

- ఉపాధి హామీ పథకంలో షెడ్ల నిర్మాణానికి 70 శాతం ఆర్థిక సాయం
- రైతు వాటా 30 శాతం కావడంతో రైతులలో అసంతృప్తి
- పది శాతానికి కుదించాలని రైతుల వినతి



రంగాపురంలో ఉపాధి హామీ పథకంలో మంజూరై నిర్మాణంలో ఉన్న కోళ్ల షెడ్డు

జి.కొండూరు: పాడి పరిశ్రమతో పాటు మాంసం ఉత్పత్తులను పెంచేందుకు గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి అవసరమైన షెడ్ల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆర్థిక సాయం అందిస్తున్నారు. పాడి పరిశ్రమ షెడ్ల నిర్మాణాకి 90 శాతం ఆర్థిక సాయం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం షెడ్ల నిర్మాణానికి 70 శాతం మాత్రమే ఆర్థిక సాయం అందిస్తూ రైతు వాటా 30 శాతంగా నిర్ణయించింది. 90 శాతం ఆర్థిక సాయం ఉన్న పాడి పరిశ్రమ షెడ్ల నిర్మాణంలో పోటీ పడుతున్న రైతులు, జీవాలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు.

నియోజకవర్గంలో మూడు షెడ్లు మంజూరు

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం మండల పరిధి మొర్సుమల్లి గ్రామంలో రెండు గొర్రెల షెడ్లు, రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో ఒక షెడ్డు నిర్మాణానికి మాత్రమే రైతులు ఆసక్తి చూపడంతో అధికారులు ఆయా షెడ్లకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి ఆర్థిక సాయం మంజూరు చేశారు. అవి ఇప్పుడు నిర్మాణ దశలో ఉన్నాయి. రైతు వాటా 30 శాతం ఖర్చు చేయాల్సి రావడంతో పాటు అవగాహనా లోపంతో కూడా ఈ షెడ్ల నిర్మాణానికి రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. నియోజకవర్గంలోని మైలవరం మండల పరిధిలో మేకలు, గొర్రెలు 39,063, జి.కొండూరు మండల పరిధిలో మేకలు, గొర్రెలు 15,794, రెడ్డిగూడెం మండల పరిధిలో మేకలు, గొర్రెలు 12,657, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో మేకలు, గొర్రెలు 10,820, విజయవాడ రూరల్ పరిధిలో మేకలు, గొర్రెలు 8,112 వరకు ఉన్నాయి.

మామిడి తోటల్లో పెంపకం

మైలవరం నియోజకవర్గంలో గొర్రెలు, మేకలు, కోళ్లను పెంచేందుకు రైతులు ఎక్కువగా మామిడి తోటలను స్థావరాలుగా ఎంచుకుంటున్నారు. సొంతగా మామిడి తోట లేకపోయినప్పటికీ మామిడి తోట యజమానుల నుంచి లీజుకి తీసుకొని మరీ గొర్రెలు, మేకలు, కోళ్లను పెంచుతున్నారు. గాలి, వెలుతురుతో పాటు చెట్ల నీడ, జీవాలు, కోళ్ల తిరిగేందుకు కావాల్సినంత స్థలం కూడా ఈ మామిడి తోటలలో లభిస్తుండటంతో జీవాలు, కోళ్ల ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడి వస్తుందని తెలుస్తోంది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జీవాలు, కోళ్ల షెడ్లకు అందించే ఆర్థిక సాయం వివరాలు

షెడ్లు	షెడ్డు ఖర్చు	ఉపాధి హామీ ఆర్థికసాయం (70 శాతం)	రైతు వాటా (30 శాతం)
	రూ.	రూ.	రూ.
గొర్రెలు/ మేకలు (20)	1,30,000	91,000	39,000
గొర్రెలు/ మేకలు (50)	2,30,000	1,61,000	69,000
కోళ్లు (100)	87,000	60,900	26,100
కోళ్లు (200)	1,32,000	92,400	39,600

ప్రతి ఒక్కరికీ మంజూరు



ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్లతో పాటు మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి షెడ్లు నిర్మించుకోవచ్చు. ఈ పథకంలో షెడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చులో 70 శాతం ఆర్థిక సాయం అందిస్తాం. రైతులు 30 శాతం ఖర్చు పెట్టుకోవాలి. దరఖాస్తు చేసే రైతులు షెడ్డు నిర్మాణానికి కావాల్సిన స్థలం కలిగి ఉండాలి. రైతులు సంప్రదిస్తే మంజూరు చేస్తాం.

– ఎస్. మాధవరెడ్డి ఏపీఓ, జి.కొండూరు మండలం

రైతు వాటా తగ్గించాలి



కోళ్ల షెడ్ల నిర్మాణానికి రైతు వాటా 30 శాతం నుంచి పది శాతానికి తగ్గించాలి. షెడ్డు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఆర్థిక సాయం అందించాలి. ముందుగా రైతు పెట్టుబడి పెట్టిన తర్వాత ఆర్థిక సాయం అందించడం అంటే ఇబ్బంది తలెత్తుతుంది. నిబంధనలు సవరించి అమలు చేస్తే షెడ్లు నిర్మించుకుంటాం.

– కలగాని రమేష్, రైతు, మునగపాడు

ప్రైవేటు అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తిరువూరు: తిరువూరులో పునర్నిర్మిస్తున్న పలు దేవాలయాల్లో అర్చకులను ఎటువంటి కారణం లేకుండా పాలకవర్గాలు తొలగిస్తున్నాయని ఏపీ ప్రైవేటు అర్చక పురోహిత సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరప్రగడ కుమారరాజా ఒక ప్రకటనలో అన్నారు. దీర్ఘకాలంగా దేవాలయ అర్చకత్వాన్ని నమ్ముకుని చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న వారిని కుంటిసాకులతో తొలగించి తమకు అనుకూలురైన వారిని నియమిస్తున్నారని ఆయన ఆరోపించారు. సంప్రదాయాలకు విరుద్ధంగా వంశపారంపర్యంగా అర్చక వృత్తిని నమ్ముకున్న పేద పూజారులను తొలగించడం శోచనీయమన్నారు. ఇటువంటి చర్యలను తమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా ఆలయాలను కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న దాతలు అర్చకుల బాధలను పట్టించుకోకుండా వారిని తొలగించడం బాధాకరమన్నారు. ఆలయ నిర్మాణం జరిపేవారు విరాళాలు సేకరించినప్పుడు కనీసం 10 శాతం బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అర్చకుల జీతాలకు నిధి సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తిరువూరులోని పలు దేవాలయాల్లో తొలగించిన వంశపారంపర్య అర్చకులను తిరిగి నియమించాలని కోరారు.

నేడు నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని విద్యార్థులకు సోమవారం నులి పురుగుల నివారణకు ఆల్ బెండజోల్ మందులు పంపిణీ చేస్తామని వైద్యారోగ్య శాఖాధికారులు తెలిపారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బంది మందులు అందజేస్తారని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 54 వేల మందికి ఈ మందులు వేస్తామన్నారు.

క్లుప్తంగా

కొత్త పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి: పీఆర్‌టీయూ



మైలవరం: కొత్త పీఆర్‌సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రాఘవరాజు డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం మైలవరంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలన్నారు. పీఆర్‌టీయూ పోరాటాలను వివరించారు. పీఆర్‌టీయూకు విశేష సేవలందించిన రిటైర్డ్ ఎంఈఓ జడ్. నాగిరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం టి. సురేష్‌బాబు, రిటైర్డ్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సీహెచ్ చలపతిరావు, రిటైర్డ్ హెచ్‌ఎం టి.వెంకటేశ్వరరావు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పి.గోపాల్, జడ్. శ్రీనివాసరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్, పీఆర్‌టీయూ మైలవరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. గోపాల్, ఎం. వెంకటేష్ పాల్గొన్నారు.

బోరు పంపు ఏర్పాటు



దొనబండ(ఇబ్రహీంపట్నం): స్థానిక ముగ్గురమ్మల ఆలయం వద్ద నూతన బోరు పంపు ఆదివారం ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భక్తుల నీటి అవసరాల మేరకు కాచవరం గ్రామానికి చెందిన అమ్మనాన్న వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు చలసాని వెంకటేశ్వరరావు బోరుపంపునకు రూ.50 వేల నగదు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన ఆర్థిక సహాయంతో డ్రిల్లింగ్ మిషన్‌తో బోరు పంపు ఏర్పాటు చేశారు. బోరుపంపు వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. సర్పంచి దండుబోయిన రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ రంగస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలి

డాక్టర్ పసుమర్తి పుల్లారావు



తిరువూరు: ఆర్య వైశ్యులు సేవా రంగానికే పరిమితమవకుండా అన్ని రంగాల్లో ముందుండాలని హైదరాబాద్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు పసుమర్తి పుల్లారావు అన్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆర్య వైశ్య ఆత్మీయ సమావేశంలో పుల్లారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఊటుకూరులో వాసవీ భవన్ నిర్మాణానికి ఆయన ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. భవన నిర్మాణం నిమిత్తం వేముల ప్రకాష్ బాబ్జీ 3 సెంట్ల భూమిని వితరణ ఇవ్వగా, పలువురు గ్రామస్తులు కూడా ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. వాసవీ క్లబ్ సభ్యులు పుల్లారావును సత్కరించారు. క్లబ్ సభ్యులు పద్మనాభుని సర్వేశ్వరరావు, వజినేపల్లి మురళీమోహన్, కాజా నాగేంద్రరావు, నేరెళ్ళ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మైలవరం: మైలవరం పట్టణంలోని ఆదాంపురానికి చెందిన బూరగ రత్తయ్యకు వైద్య పరీక్షల నిమిత్తం ఆదాంపురం సంఘ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. రత్తయ్య కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ సరిగ్గా పని చేసుకోలేని నిస్సహాయ స్థితిలో ఇటు కుటుంబ పోషణకు, వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సంఘ పెద్దలు వరకాల ఏసుపాదం, కోడిరెక్కల రవికుమార్, వాడపల్లి వసంతరావు, జాన్ మాస్టర్, బొడ్డు విజయ్ బాబు, బండ్లమూడి శ్యామ్ తమ వంతు బాధ్యతగా ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పశువుల హాస్పిటల్ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా సోమవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ పట్టణం) పి. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌సీఎం చర్చి, బొడ్డురాయి సెంటర్, మైలురాయి సెంటర్, పశువుల హాస్పటల్, మసీదు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ధర లేక దిగాలు

- ఎండుమిర్చికి గిట్టుబాటు ధర లేక గగ్గోలు
- మిర్చి యార్డు ఏర్పాటు చేయాలని వినతి



నరసింహారావుపాలెంలో కల్లంలో ఎండబెట్టిన మిర్చి

చాట్రాయి: ఎండు మిర్చికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నరసింహారావుపాలెం, సి గుడిపాడు, చీపురుగూడెం, బూరుగుగూడెం, చిన్నంపేట గ్రామాల్లో సుమారు 450 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పండు కాయలు కోసి కల్లాల్లో ఎండబెడుతున్నారు. ఎండు మిర్చి కోసం తాడేపల్లిగూడెం, ఏలూరు, వరంగల్, గుంటూరు నుంచి ఏటా వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పటికి వ్యాపారాలు మందకొడిగా సాగుతున్నాయి. అయితే మిర్చి యార్డు అందుబాటులో లేకపోవడంతో ధర లేకపోయినా అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోందని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండు మిర్చి నాణ్యతను బట్టి పలు రకాలుగా బేరాలు జరుగుతున్నాయి. సన్నం క్వింటా రూ. 10 వేల నుంచి 12 వేలు, లావు క్వింటా రూ. 38 నుంచి 40 వేలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

ఖర్చులు తడిసి మోపెడు

మిర్చి సాగుకు ఎకరానికి పురుగు మందులు, దుక్కి, కూలీల ఖర్చులు కలిపి రూ. 2.లక్షలు, కౌలుకి రూ.20 వేలు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. పంట చేతిక వచ్చాక గిట్టుబాటు ధర లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి పైరుకు ఈ సంవత్సరం నల్లి తెగులు వ్యాపించడంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. ధరలు కూడా తగ్గితే నష్టాల ఊబిలో కూరుకుపోతామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మిర్చి యార్డు అందుబాటులో ఉండి, మద్దతు ధరకు కొనుగోలు చేస్తేనే రైతులకు మిర్చి సాగు లాభదాయకంగా ఉంటుంది.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకునేందుకు వేచి ఉన్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు ; అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

రేపటి నుంచి రంగుల మహోత్సవం

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల రంగుల మహోత్సవం ఈ నెల 11న, కల్యాణ మహోత్సవం ఈనెల 12న నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.తేజ తెలిపారు. 12వ తేదీ సాయంత్రం యాదవ రాజులచే జల బిందెల కార్యక్రమం, అనంతరం గ్రామోత్సవం జరుగుతుందని చెప్పారు.

విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

చాట్రాయి: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను అమలు చేయనున్నట్లు వ్యవసాయాధికారి బి.శివశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సొంత భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో 14 అంకెల కార్డుని ప్రవేశ పెట్టనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రాయితీలకు ఈ కార్డు అవసరమని చెప్పారు. పట్టాదాసు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ నెంబరుకి లింకు అయిన ఫోన్ నంబరుతో సంబంధిత వ్యవసాయ సిబ్బందిని కలిసి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు



నూజివీడు జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నూజివీడు: విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకమైంది. దీనిలో వచ్చే మార్కులు భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి. పబ్లిక్ పరీక్షలు కావడంతో తప్పక ఉత్తీర్ణత సాధిస్తేనే పై తరగతులకు వెళ్తారు. పబ్లిక్ పరీక్షలు అంటేనే విద్యార్థుల్లో ఒక రకమైన భయం, టెన్షన్ ఉంటుంది. ఈ ఏడాది మార్చి 17 నుంచి 31 వరకు పబ్లిక్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా విద్యా శాఖ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపుతున్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పబ్లిక్ పరీక్షలకు నెల రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రేడ్‌లుగా విభజించి సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేకంగా తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను చదివిస్తున్నారు.

నియోజకవర్గంలో 2,665 మంది టెన్త్ విద్యార్థులు

నూజివీడు నియోజకవర్గంలో 33 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 2,665 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వారిని పలువురు ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ఉత్తీర్ణులయ్యేలా కసరత్తు చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సెలవు దినాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద భోజన సదుపాయాన్ని సైతం ఏర్పాటు చేశారు. పాఠశాలలు ఉన్న రోజుల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉపయోగపడు తున్నాయి



ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు రోజుల్లో నిర్వహించే స్టడీ అవర్స్ బాగా ఉపయోగపడుతున్నాయి. పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో బాగుంది. సందేహాలను నివృత్తి చేయడంతో పాటు భయాన్ని పోగొట్టేందుకు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

– తాణంకి విన్నీ, జెడ్పీ బాలికల హైస్కూల్, నూజివీడు

పర్యవేక్షిస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైస్కూళ్లలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ నిర్వహణపై పర్యవేక్షణ చేస్తున్నాం. విద్యా శాఖ ఇచ్చిన 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. పరీక్షల సమయం తక్కువ ఉండటంతో సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

– ఎం.సేవియా, డీవైఈఓ, నూజివీడు

12న నాగేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ వార్షికోత్సవం

ముసునూరు: గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్‌లోని ప్రత్యక్ష నాగేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 12న ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

తిరువూరు: వైఎస్సార్ సీపీ గంపలగూడెం మండల కార్యకర్తల సమావేశం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. తోటమూల విజయవాడ రోడ్డులోని చెరుకు కోటిరెడ్డి మామిడి మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అధ్యక్షతన జరిగే సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

స్తంభం వేశారు.. కనెక్షన్ మరిచారు



రోడ్డుపైకి వంగి ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభం

ముసునూరు: వంగిపోయిన విద్యుత్ స్తంభం వైర్లతో సహా రహదారి పైకి వాలి ప్రమాదకరంగా మారిందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముసునూరులో వలసపల్లి వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో బడుగువారిగూడెం అంతర్గత రహదారిలో విద్యుత్ ఇనుప స్తంభం వంగి పూర్తిగా రహదారి మధ్యకు వాలిపోయింది. పడిపోయిన స్తంభం స్థానంలో మరో స్తంభం వేసి నెలలు గడుస్తున్నా దానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మర్చిపోయారు. దీంతో సర్వీసు వైర్లతో ఉన్న ఇనుప స్తంభం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సమీప గృహస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ స్తంభానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ప్రమాద భరితంగా ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

తిరువూరు: గంపలగూడెం మండలం దుందిరాలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి బంకా బాబూరావు ఆధ్వర్యంలో విజయవాడ అనూ ఆస్పత్రి వైద్యులు శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ రోగులతో పాటు గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు తదితర సమస్యలున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

26 నుంచి సిలువగట్టు తిరునాళ్లు



నూజివీడు: సిలువగట్టు తిరునాళ్ల ఉత్సవాలు ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని నూజివీడు వికారిఏట్ ఫోరెన్ రెవ.ఫాదర్ లాం జయరాజు తెలిపారు. తిరునాళ్లకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. జయరాజు మాట్లాడుతూ వ్యాకులమాత దీవెనలు, సిలువగట్టు మహిమలు ప్రతి ఒక్కరూ పొందాలని కోరారు. రెక్టర్ ఫాదర్ గొర్రుముచ్చు జోసెఫ్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో నూజివీడు ప్రాంతంలోని క్రైస్తవులందరూ ఐకమత్యంతో కలిసి నిర్వహించుకునే అతి పెద్ద పండుగ సిలువగట్టు తిరునాళ్లని చెప్పారు. ఈ నెల 26, 27, 28 తేదీలలో జరుగనున్న సిలువగట్టు పుణ్య క్షేత్ర తిరునాళ్లలో క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొనాలని కోరారు.